



విజయ సంకేతం చూపిస్తున్న విజేతలు



ప్రథమ స్థానం : ముగ్గు వేస్తున్న అరుణకుమారి



ద్వితీయ స్థానం : రంగవల్లి తీర్చిదిద్దిన పవిత్ర



తృతీయ స్థానం : ముగ్గును అలంకరిస్తున్న శ్రీలత

- 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీకి విశేష స్పందన
- జిల్లా కేంద్రంలో నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

ఇలపై.. ఇంద్రధనస్సు

పార్వతీపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రానికి ముందే సంక్రాంతి వచ్చింది. రంగవల్లులతో ఇలపై హరివిల్లు వాలిందా అన్న చందంగా మారింది. ముచ్చట గొలిపే ముగ్గులు వేసేందుకు జిల్లా నలమూలల నుంచి తరలివచ్చిన మహిళలతో ఆ ప్రాంతం కళకళలాడింది. పార్వతీపురంలో 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. విద్యార్థినులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" సహకారంతో సాగాయి. పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో స్థానిక స్పాన్సర్ శ్రీ వెంకటేశ్వర జ్యూయల్ పేలస్ నేతృత్వంలో ఉదయం 10 గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభమయ్యాయి. పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. నిర్ణీత సమయంలోగా రంగు రంగుల ముగ్గులు వేసి చూపరులను కట్టిపడేశారు. విభిన్న ఆకృతులు, సందేశాలతో ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ముగ్గులతో సందడి చేశారు. అనంతరం బొబ్బిలి ఎన్‌డబ్ల్యూ వైహెచ్‌సీ ప్రధాన కార్యదర్శి ఎం.విజయలక్ష్మి, విజయనగరం డీఎంవో కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్.రమణి, పార్వతీపురం డీవీఎం పాఠశాల సాంఘిక ఉపాధ్యాయరాలు వి.ప్రమీలారాణి, పట్టణానికి చెందిన బంపాడ పద్మజ న్యాయ నిర్ణేతులగా వ్యవహరించారు. వారు ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో పార్వతీపురానికి చెందిన వి.అరుణకుమారి ప్రథమ స్థానం, జిల్లాకేంద్ర వాసులైన కె.పవిత్ర ద్వితీయ స్థానం, వి.శ్రీలత తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు శ్రీ వెంకటేశ్వర జ్యూయల్ ప్యాలెస్ యజమాని యిండుపూరు గోపాలరావు, కెనరా బ్యాంక్ మేనేజర్ దినేష్, న్యాయనిర్ణేతల చేతుల మీదుగా బహుమతులు అందించారు. ప్రథమ విజేతకు రూ.6వేలు, ద్వితీయ విజేతకు రూ.4వేలు, తృతీయ విజేతకు రూ.3 వేలు నగదు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు.



పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



నగదు బహుమతులు అందుకుంటున్న ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలు అరుణకుమారి, పవిత్ర, శ్రీలత



సాలూరులో చెవిలో క్యాబేజీ పువ్వు పెట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

ఎస్మాపై తగ్గేదే లేదు

- సర్కారు తీరుపై అంగన్‌వాడీల మండిపాటు
- జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె చేస్తామని వెల్లడి

పార్వతీపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని, ఎస్మాపై తగ్గేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా శనివారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. గత 26 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై వైసీపీ ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారిని అత్యవసర సర్వీసుల కిందకు తీసుకొస్తూ.. జీవో నెంబరు 2ను విడుదల చేసింది. దీని ప్రకారం ఆరు నెలల పాటు సమ్మెలు, నిరసనలు నిషేధిస్తున్నట్లు పేర్కొంది. అయితే దీనిపై జిల్లాలో అంగన్‌వాడీలు, ప్రజా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న తమపై ఈ విధంగా సర్కారు స్పందించడం తగదన్నారు. సమస్యలపై స్పందించకపోగా ఎస్మా ప్రయోగించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈనెల 5న అంగన్‌వాడీలు విధుల్లోకి హాజరవ్వాలని నోటీసులు ఇచ్చిన సర్కారు తాజాగా జీవో నెంబరు 2 జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పాలకొండలో గుంజీలు తీస్తూ..



భామినిలో ఒంటికాలిపై నిల్చొని..

హామీలు అమలు చేయాల్సిందే..

బెలగాం/పాలకొండ/సాలూరు రూరల్/భామిని: గత ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జిల్లాకేంద్రంలో అంగన్‌వాడీలు నినదించారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా కలెక్టరేట్ వద్ద 24 గంటల నిరవధిక నిరసన దీక్ష చేపట్టారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఎన్ని ఎస్మాలు ప్రయోగించినా సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు. చర్చల పేరుతో ఇంతకాలం కాలయాపన చేసి.. ఇప్పుడు విధుల నుంచి తొలగిస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చిరుద్యోగులపై ఇటువంటి చర్యలు తగవన్నారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్కారు స్పందించే వరకు పోరాటం కొనసాగిస్తామని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. పాలకొండలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శిబిరంలో అంగన్‌వాడీలు గుంజీలు తీసి నిరసన ప్రదర్శన చేపట్టారు. సాలూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు చెవిలో క్యాబేజీ పువ్వును పెట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్-2కు వ్యతిరేకంగా భామినిలో అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. 'దేవుడా నువ్వే రక్షించు' అంటూ మొక్కుకున్నారు. రాష్ట్ర సంఘం సూచనల మేరకు ఆందోళన కొనసాగిస్తామని వెల్లడించారు. సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. కాగా అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో తక్షణమే రద్దు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ తదితరులు డిమాండ్ చేశారు.

పుర కార్మికుల ముట్టడి

- మున్సిపల్ కార్యాలయాల ఎదుట బైఠాయింపు

పార్వతీపురం టౌన్/పాలకొండ/సాలూరు రూరల్, జనవరి 6: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నినదించారు. ఈ మేరకు శనివారం పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వైసీపీ ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని నినదించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అందర్నీ రెగ్యులర్ చేయాలని, హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని, లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సాలూరు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన కార్మికులు



పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట..

పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం ఎదుట కూడా పారిశుధ్య కార్మికులు బైఠాయించి సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోవాలనే నినాదంతో సాలూరులో పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. సమ్మెపై ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాలూరు సీఐ జి.దేవుడుబాబు ఆధ్వర్యంలో పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడం

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల వెల్లడి
- జిల్లా కేంద్రంలో ఆందోళన

బెలగాం, జనవరి 6: వైసీపీ సర్కారు బెదిరింపులకు భయపడేది లేదని సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు నినదించారు. ఈ మేరకు శనివారం పార్వతీపురంలోని కలెక్టరేట్ శిబిరం వద్ద వినూత్నంగా నిరసన తెలిపారు. డప్పులు వాయించి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గేయాలు ఆలపించారు. నోటీసులకు సరైన సమాధానం ఇవ్వలేదనే సాకుతో విద్యాశాఖ అధికారులు తమను టెర్మినేట్ చేశామని భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. అయితే ఇటువంటి వాటికి జడిసేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని చెప్పారు.



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

టీడీపీతోనే బంగారు భవిష్యత్

● బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు
● పంపిణీ చేసిన నాయకులు

టీడీపీతోనే ప్రజలకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. శనివారం ఉమ్మడి జిల్లాలో బాబూష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి వైసీపీ అరాచకాలు, చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి ప్రజలకు వివరించి, కరపత్రాలు పంపిణీచేశారు.



శృంగవరపుకోట: బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంపై వివరిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ



శృంగవరపుకోట రూరల్:చుక్కవానిపాలెంలో బాబూష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న లలితకుమారి

●శృంగవరపుకోట రూరల్: రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు టీడీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి తెలిపారు. మండలంలోని చుక్కవానిపాలెంలో బాబూష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు జీఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న పాల్గొన్నారు.

● శృంగవరపుకోట: సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. శృంగవరపుకోట పందరప్పన్న కూడలి, రామ్‌నగర్ కాలనీల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, పార్టీ మండల కార్యదర్శి జుత్తాడ రామసత్యం, అడారి రమేష్, ఎం.మంగరాజు పాల్గొన్నారు.

●గంట్యాడ: మండలంలోని నరవ, బుడతనాపల్లిల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, పార్టీ నాయకులు బూడి అప్పలనాయుడు, సుంకరి సాయి, రామునాయుడు పాల్గొన్నారు.

● మెంటాడ: ఇప్పలవలసలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామంలో పర్యటించి, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.

● సీతంపేట: ప్రతి ఒక్కరి మదిలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్ష ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. పెదరామలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సవర తోట ముఖలింగం, బిడ్డిక అప్పారావు, గేదెల కాంతారావు, ఆర్.రంగనాథం, బిడ్డిక నీలయ్య, హిమరిక పవన్, తోయిక సంధ్యారాణి పాల్గొన్నారు.



గంట్యాడ: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు



మెంటాడ: ఇప్పలవలసలో కోలాటం ఆడుతున్న సంధ్యారాణి



సీతంపేట: పెదరామలో కరపత్రం అందజేస్తున్న జయకృష్ణ

81 మద్యం సీసాల స్వాధీనం

విజయనగరం క్రైం: విజయనగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో బెల్టుషాపుల నిర్వాహకులు, పేకాట శిబిరాలపై ఉక్కుపాదం మోపారు. శుక్రవారం రాత్రి ముగ్గురు బెల్టుషాపుల నిర్వాహకులను అదుపులోకి తీసుకుని 81 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.అలాగే 12 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని 89,200 నగదు స్వాధీనం చేసుకుని స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. తనిఖీల్లో ఎస్‌ఐలు భాస్కరరావు,అశోక్, రామగణేష్, గోపాలరావు పాల్గొన్నారు.

● రేగిడి: సంకిలిలో శనివారం నిర్వహించిన దాడులో ఓ వ్యక్తి నుంచి 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.మూడురోజుల వ్యవధిలో సంకిలిలో ఓ పేకాటశిబిరంపై దాడులు నిర్వహించి నలుగుర్ని అదుపులో తీసుకొని రూ. 6999లు నగదు సీజ్‌చేసిన సంగతి తెలిసిందే.

● రాజాం రూరల్: మునిసిపాలిటీ పరిధిలోని కొండంపేటకు వెళ్లే మార్గంలో రేగిడి మండలం పనసలవలస గ్రామానికి చెందిన పొట్నూరు కనకరాజు అక్రమంగా తరలిస్తున్న 18 మద్యం సీసాలు శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు. ఆయనపై కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

వంట సారా, బెల్ట్ షాపులపై దాడులు

కొత్తవలస:కొత్తవలస, శృంగవరపుకోట పోలీసుల ఆధ్వర్యంలో శనివారం మండలంలో వంటసారా తయారీ కేంద్రాలు, బెల్ట్ షాపులపై మెరుపు దాడులు చేశారు. ఈ దాడులలో భారీగా అక్రమ మద్యంతో పాటు, వంట సారా, సారా తయారీకి వినియోగించే బెల్లం ఊటలను పట్టుకున్నారు. ముసిరాంలో ఇద్దరు మహిళలను, కొత్తవలస, చింతలపాలెంలో మరో నలుగురిని అరెస్టుచేశారు. కొత్తవలస సీఐ వి.చంద్రశేఖర్, ఎస్.కోట సీఐ ఎస్.బాల సూర్యారావు రెండు బృందాలుగా దాడులుచేశారు. బాల సూర్యారావు ఆధ్వర్యంలో ముసిరాం, రామలింగపురంలో రెండు మద్యం బెల్ట్‌షాపులపై దాడులు చేసి 32 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మహిళలపై కేసులు నమోదుచేశారు. 1250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసంచేశారు. ఇద్దరు మహిళలను అరెస్టుచేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కొత్తవలస సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చినమన్నిపాలెంలో దాడులు చేసి 100 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు 250 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్టు తెలిపారు. కొత్తవలస, చింతలపాలెంలో నిర్వహించిన దాడులలో బెల్ట్ షాపుల నుంచి 39 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ దాడులలో ఎస్‌ఐ వీర జనార్దన్, ఏఎస్‌ఐలు సూర్యప్రకాశరావు, రెహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

గుయ్యన్నవలసలో గడ్డివాముల దగ్ధం

రాజాం: గుయ్యన్నవలసలో గడ్డివాములు, టేకు చెట్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పాలవర్తి పెంటయ్య, ఆదినారాయణకు చెందిన గడ్డివాములు, టేకు చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మంటలను అదుపు చేసేందుకు వారంతా ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించలేదు. వీటి విలువ రూ.60 వేలు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

1,200 హెక్టార్లలో సూక్ష్మసేద్యం: పీడీ

లక్కవరపుకోట: జిల్లాలో 1200 హెక్టార్లు ఈ ఏడాది సూక్ష్మసేద్యం లక్ష్యంగా నిర్ణయించినట్లు జిల్లా మైక్రో ఇరిగేషన్ పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని దాసుల్లుపాలెం, కల్లెంపూడిల్లో ఏర్పాటుచేసిన డ్రిప్, స్పింక్లర్ల యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్.కోట మండలంలో 30 హెక్టార్లలో సూక్ష్మసేద్యం లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, బి.సురేష్, మూర్తి, రమణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురంలో ధాన్యం కొనుగోలును శనివారం ప్రారంభించారు. వీఏఏ వరలక్ష్మి 17 మంది రైతుల నుంచి సుమారు 60 టన్నుల ధాన్యాన్ని సేకరించి, స్థానికంగా ఉన్న రైసుమిల్లుకు పంపించినట్లు తెలిపారు. మిగిలిన రైతుల నుంచి కూడా ధాన్యం సేకరిస్తున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలుచేయాలి అన్న శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర మంత్రిని కలిసిన పావని

దాసన్నపేట: కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తమ రూపాలను బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డిపావని కలిశారు. శనివారం పూసపాటిరేగ మండలం చింతపల్లిలో సాగర్ పరిక్రమ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇక్కడకు వచ్చారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా హరిబాబు



హరిబాబు

రాజాం/ రూరల్: రాజాం సీహెచ్‌సీ (100 పడకలు) సూపరింటెండెంట్‌గా చిన్నపిల్లల వైద్య నిపుణుడు కరణం హరిబాబును నియమిస్తూ శనివారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మికి శ్రీకాకుళం డీసీహెచ్‌ఎస్‌గా పదోన్నతి లభించింది. దీంతో హరిబాబును సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. సహచర వైద్యులు, సిబ్బందితో పాటు అందరి సహకారంతో రోగులకు మెరుగైన వైద్యసేవలందేలా కృషిచేస్తానని హరిబాబు తెలిపారు.

31 పంచాయతీల్లో వికసిత్ భారత్: ఎంపీడీవో

రేగిడి: మండలంలో శనివారానికి సంకిలి, రేగిడితోపాటు 31 పంచాయతీల్లో వికసిత్‌భారత్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నట్లు చెప్పారు.

'విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలి'

విజయనగరం దాసన్నపేట: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులతో సిబ్బంది స్నేహపూర్వకంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. శనివారం స్థానిక వెనుకబడిన తరగతుల వసతిగృహాల సంక్షేమ అధికారులతో మర్రి చెన్నారెడ్డి భవనంలో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో వెనుబడినతరగతుల సంక్షేమ శాఖాధికారి కిడారి సందీప్ కుమార్, సహాయ అధికారులు యశోదననావు, రాజులమ్మ, శ్యామలకుమారి, సీడబ్ల్యూసీ అధికారి యాళ్లా నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజాంలో తాగునీటి సరఫరాకు చర్యలు

రాజాం:పురపాలక సంఘ ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు కమిషనర్ ఎంవీ నాగరాజు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో తాగునీరు సరఫరా చేయించేందుకు శనివారం చర్యలు తీసుకున్నారు. రక్షిత మంచినీటి పథకాల వద్ద పనిచేస్తున్న సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది కలిసి శుక్రవారం నుంచి సమ్మెచేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో బొబ్బిలి రోడ్డులో ఉన్న రక్షిత పథకంతో పాటు శ్రీకాకుళం, సారథి, గోపాలపురం, డోలపేట పథకాల నుంచి సరఫరాకు చర్యలు చేపట్టారు. కొన్ని వార్డులకు పూర్తి స్థాయిలో అందించలేకపోయారు. వాల్స్ తెరిచేచోట రెగ్యులర్ సిబ్బందితో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన లేనందున సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం నుంచి పూర్తి స్థాయిలో అందరికీ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు ప్రకాష్

కొత్తవలస : అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు కంటకాపల్లి గ్రామానికి చెందిన తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ములపర్తి ప్రకాష్‌ను ఎంపికచేశారు. తైక్వాండో కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల24 నెంచి 31 వరకు థాయ్‌లాండ్‌లో పోటీలను నిర్వహించనున్నారు. ఈ ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ఎంపిక పత్రాన్ని ప్రకాష్‌కు అందజేశారు.

జీవో-512ను రద్దు చేయాలి

బొబ్బిలి: రాష్ట్రంలో సన్న, చిన్నకారు, పేద, దళిత వర్గాలకు చెందిన భూముల కబ్జాలకు అవకాశం కల్పించే విధంగా ఉన్న జీవో- 512ని రద్దు చేయాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు డిమాండ్ చేశారు. బొబ్బిలి సంగవీధిలో గల అంబేడ్కర్ విగ్రహానికి శనివారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది గంగాధర్, సిరిపురపు ప్రసాద్, బాలరాజు పాల్గొన్నారు.

'రా..కదలిరా' విజయవంతం చేస్తాం

● వైసీపీ పాలనకు చరమగీతం పలకాలి
● ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట: బొబ్బిలిలో ఈనెల పదో తేదీన జరిగే రా..కదలిరా బహిరంగ సభను విజయవంతం చేస్తామని ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి తెలిపారు.శనివారం శృంగవరపుకోటలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రా..కదిలిరా పేరుతో టీడీపీ అధినేత నారాచంద్రబాబు నాయుడు పిలుపునకు రాష్ట్ర ప్రజలు కదలివస్తున్నారని తెలిపారు. పార్టీ ఆవిర్భావ సమయంలో అన్న నందమూరి తారకరామారావు తెలుగుదేశం పిలుస్తోంది..రా..కదలిరా.. అంటూ పిలిచిన పిలుపునకు అప్పుడు జనం జేజేలు కొట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు కూడ టీడీపీ ఇదే పిలుపుతో ప్రజల్లోకి వెళ్తుందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 29వ తేదీ వరకు 22 పార్లమెంట్ స్థానాల్లో చంద్రబాబు నాయుడు పర్యటిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా బహిరంగ సభల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తారని చెప్పారు. బొబ్బిలిలో జరగనున్న రా..కదలిరా బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. రా..కదలిరా ద్వారా ప్రజలను చైతన్య పరచాలని కార్యకర్తలకు సూచించారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనకు చరమగీతం పలకాలని కోరారు. కులాల పేరుతో జగన్ ప్రజలను ప్రాంతాల వారీగా విడదీస్తున్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళలు, బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు జీఎస్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, నాయకులు భీశెట్టి అరుణ, లగుడు తిరుపతి, గొంప ఉమేష్, కొణదం మల్లేశ్వరరావు, పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), అనకాపల్లి చెల్లయ్య, బోనంగి జ్యోతి పాల్గొన్నారు.

నేడు టీడీపీ నియోకవర్గ స్థాయి సమావేశం

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం ఉదయం పది గంటలకు పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా)లో జరగనుంది. ఈనెల పదో తేదీన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరగనున్న 'రా కదలిరా' బహిరంగ సభకు విజయనగరం నుంచి పార్టీ శ్రేణులు తరలివెళ్లేందుకు ప్రణాళిక సమావేశంలో రూపొందించనున్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజులు హాజరుకానున్నారు.. గ్రామ, డివిజన్ స్థాయిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని నగర, మండల పార్టీల నుంచి సమాచారం వెళ్లింది.

టీడీపీలో 150 కుటుంబాల చేరిక



తెర్లాం: జావాన రమేష్‌కు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బేబీనాయన, తెంటు

తెర్లాం: మండలంలో డి.గదబవలస సర్పంచ్ జావాన రమేష్ శనివారం టీడీపీలో చేరారు. టీడీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమేష్, ఎంపీటీసీ మాజీసభ్యుడు జావాన అప్పలస్వామి తోపాటు సుమారు 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి.వైసీపీ బాధ భరించలేకే తమ పార్టీలో చేరారని టీడీపీ మండలాధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు తెలిపారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్రవాణిజ్య విభాగాల కార్యదర్శి వెంకటేశ్వరరావు, యుగంధర్, శశిభూషణరావు, సింహాచలం, సురేష్ పాల్గొన్నారు.

బాడంగిలో తెంటుకు నివాళి

బాడంగి: బాడంగిలో దివంగత తెర్లాం ఎమ్మెల్యే తెంటు జయప్రకాష్ 16వ వర్ధంతి పురస్కరించుకు శనివారం నివాళులర్పించారు. తొలుత జయప్రకాష్ సమాధి వద్ద ఆయన కుమారుడు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు శ్రద్ధాంజిలి ఘటించారు.అనంతరం తెంటు బంగ్లా వద్ద జయప్రకాష్ విగ్రహానికి తెంటు లక్ష్మంనాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తెంటు రవిబాబు, గుణుపూరు స్వామినాయుడు, వైస్‌ఎంపీపీ భాస్కరరావు, బంటు కృష్ణమూర్తి, నర్సుపల్లి వెంకటేష్, జిల్లా ఏకలవ్య అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరి, జిల్లా పార్లమెంట్ బీసీ సాధికారిత కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథనాయుడు, ఎల్.సత్యం పాల్గొన్నారు.

బొబ్బిలిలో అన్నదానం

బొబ్బిలి:తెంటు జయప్రకాశ్‌వర్ధంతిని పురస్కరించుకొని బొబ్బిలిలోని అన్న క్యాంటీన్‌లో ఆయన అభిమానులు అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తెంటు చిరంజీవిరావు, రవిబాబు, బాడంగి వైస్ ఎంపీపీ భాస్కరరావు, నంది హరి, ఎల్.సత్యం, గునుపూరు ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎస్.కోటలో ఆక్రమణల తొలగింపు



బోర్డు ఏర్పాటుచేస్తున్న రెవెన్యూ అధికారులు

శృంగవరపుకోట: శృంగవరపుకోటలోని పందిరప్పన్న కూడలి సమీపంలో గల గెడ్డఆక్రమించి నిర్మించిన కట్టడాన్ని రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. గెడ్డ.. ఆక్రమణదారుల గడ్డ శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించిం ది. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు గెడ్డను సర్వే చేసి, ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ఈస్థలంలో తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, సర్వేయర్ వెంకటరావు, గ్రామ రెవెన్యూ అధికారులు రమణ, కన్నయ్య, నాయుడు తదితరులు ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారు శిక్షార్హులని బోర్డు శనివారం ఏర్పాటుచేశారు.అలాగే నిర్మాణం ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. చెరకు కాటా సమీపంలోని గెడ్డ ఆక్రమణలను కూడా రెండు రోజుల్లో తొలగిస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

ఎస్‌ఐలుగా ఎంపికైన అభ్యర్థులు రేంజ్ కార్యాలయానికి హాజరుకావాలి

విజయనగరం క్రైమ్: పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల నిర్వహించిన ఎంపికల్లో సివిల్ ఎస్‌ఐ (పురుషులు, మహిళలు) ఏపీఎస్పీ, ఆర్‌ఎస్‌ఐలుగా ఎంపికైన పురుష అభ్యర్థులు ఈనెల 8, 9 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల్లోగా తమ కార్యాలయానికి ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై అటెస్టేషన్ ఫారాలు నింపి తదుపరి ఉత్తర్వులు స్వీకరించేందుకు హాజరుకావాలని పేర్కొన్నారు.

ఉద్యోగావకాశాలపై అవగాహన

విజయనగరం రింగురోడ్డు: స్థానిక ఎంఆర్ అటానమస్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు భవిష్యత్ విద్య, ఉద్యోగావ కాశాలు అన్న అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్య క్రమంలో గాయిత్రీ విద్యా సంస్థల ప్రతినిధి డాక్టర్ బి.రాజేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, భౌతికశాస్త్ర విభాగాధిపతి సత్యనారాయణరావుతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎస్మాకు బెదిరేది లేదు'

రామభద్రపురం:అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించినా బెదిరేదిలేదని సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు.

'కాపులను మోసం చేసిన జగన్'

శృంగవరపుకోట: సీఎం జగన్ కాపులను మోసం చేస్తున్నారని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఒబ్బిన సన్యాసినాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాపులకు రిజర్వేషన్ ఇచ్చేదిలేదని చెప్పిన జగన్‌కు కొంత మంది కాపు నాయకులు మద్దతు ఇవ్వడం దురదృష్టకరమని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లో కోటాను రద్దుచేసిన జగన్‌ను ప్రశ్నించాలని వైసీపీ కాపు నాయకులనుకోరారు.టీడీపీ-జనసేన కూటమిని అధికారంలోకి తేచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మునిసిపల్ కార్యాలయాల ముట్టడి

● తెల్లవారుజామునే సీఐటీయూ నాయకుల అరెస్టు



బొబ్బిలి:సీఐటీయూ నాయకులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు



రాజాం: కార్యాలయంలోకి వెళ్లకుండా కమిషనర్‌ను అడ్డుకుంటున్న కార్మికులు

తమ సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆందోళన ఉధృతంచేశారు. సమ్మెలోభాగంగా12 రోజులుగా వినూత్నంగా నిరసన తెలిపారు.శనివారం రాజాం, బొబ్బిలి మునిసిపల్ కార్యాలయాలను ముట్టడించారు. సీఐటీయూ నాయకులు కార్యాలయాన్ని ప్రకటించిన నేపథ్యంలో బొబ్బిలిలో తెల్లవారుజమునే అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు.

బొబ్బిలి: మునిసిపల్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెలో భాగంగా శనివారం మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ నాయకులు ప్రకటించిన నేపథ్యంలో తెల్లవారుజామునే అరెస్టుచేశారు. స్థానిక రెడ్డిక వీధిలో సీఐటీయూ నాయకుడు పొట్నూరు శంకరరావు నివాసానికి వెళ్లి పోలీసులు ముందస్తు అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. పోలీసుల తీరుకు నిరసనగా వారి వాహనం ముందు బైఠాయించారు. ఆయనకు మద్దతుగా మరికొంతమంది కార్మికులు నిరసన తెలిపారు. అయితే బలవంతంగా వారందరినీ వాహనంలో పోలీసుస్టేషన్‌కు తరలించారు.శంకరరావుతో పాటు ఐదుగురిని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. అనంతరం తమ నాయకుల అక్రమ అరెస్టును నిరసిస్తూ పారిశుధ్య కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు బొబ్బిలి మునిసిపల్ కార్యాలయం ముందు బైఠాయించారు.ఎస్‌ఐలు జ్ఞాన ప్రసాద్, భాగ్యం, ఏఎస్‌ఐ భాస్కరరావు, హెచ్‌సి మంగమ్మ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

●రాజాం రూరల్: మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది శనివారం కార్యాలయాన్ని ముటడించారు. సమస్యల పరిష్కారం కోసం 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న విషయం విదితమే. ఈ సందర్భంగా సామాజిక ఆసుపత్రిలో నుంచి కార్యాలయం లోనికి వెళ్లే గేట్లకు తాళాలు వేశారు. మునిసిపల్ కార్యాలయం ముందుభాగాన్ని తమ ఆధీనంలోనికి తీసుకుని సిబ్బంది విధులకు హాజరుకాకుండా చేశారు. దీంతో కమిషనర్ నాగరాజు, సిబ్బంది వెనుదిరిగారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వలంటీర్లతో పింఛన్ల పంపిణీ సరికాదు

● పాటూరు సర్పంచ్ కొట్యాడ వెంకటలక్ష్మి అభ్యంతరం

వేపాడ: సచివాలయ పరిధిలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యురాలు, వార్డు సభ్యులు, గ్రామకార్యదర్శులను పక్కనపెట్టి వలంటీర్లతో సచివాలయకన్వీనర్ ద్వారపూడి గంగునాయుడు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీచేయడం సరైన పద్ధతికాదని పాటూరు సర్పంచ్ కొట్యాడ వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ కొట్యాడ రమణమూర్తి, వార్డు సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ మేరకు శనివారం పాటూరు సచివాలయ ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడుతూ తాము టీడీపీ మద్దతుదారులం కావడంతో అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల్లో ఓటమిపాలైన వ్యక్తితో పింఛన్లు పంపిణీ చేయించడం పాలకమండలిహక్కులు హరించడమేనని, మహిళా సర్పంచ్‌ను కించపరచడమేనని సర్పంచ్ ఆందోళన వ్యక్తంచేశారు. పింఛన్ల పంపిణీ విషయంపై ఈవోపీఆర్డీ ఉమ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఈవిషయాన్ని కలెక్టర్, మండల సర్పంచ్‌ల సంఘం దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. అధికార పార్టీ నాయకుల సూచనల మేరకు సచివాలయ కన్వీనర్ ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీచేసిన వలంటీర్లపై చర్యలు చేపట్టి సర్పంచ్, పాలక మండలి హక్కులను కాపాడాలని డిమాండ్‌చేశారు. లేదంటే అధికారం ఉందకదా అని నిబంధనలకు విరుద్ధంగా సర్పంచ్‌ల విధులు,హక్కులకు భంగం కల్పిస్తే క్రిమినల్ కేసులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. వైసీపీ మండలాధ్యక్షుడు ముమ్ములూరి జగ్గుబాబు పాటూరు పంచాయతీ పాలనలో వేలు పెట్టి పింఛన్ల పంపిణీకి సూచనలు చేయడం మంచి పద్ధతికాదని హితవుపలికారు.

'మా భూముల నుంచి బైపాస్ వద్దు'

శృంగవరపుకోట: మా భూముల నుంచి బైపాస్ రోడ్డు నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.శనివారం ఎస్.కోటలో సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వెంకట రమణపేట కూడలి నుంచి బోడరా వరకు నిర్మించనున్న బైపాస్ రోడ్డుతో భూములను కోల్పోతున్నామని వారంతా వాపోయారు. కనీసం భూమికి భూమైన ఇప్పించాలని, లేకపోతే అత్యధికంగా నష్టపరిహారమైన వచ్చేలా ప్రయత్నం చేయాలని విజ్ఞప్తిచేశారు.

ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష

బొబ్బిలి: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మరింత అవగాహన పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం దీనిపై సంబంధిత ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులతో సమీక్షించారు.

'సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి'

వేపాడ: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు పరిష్కరించడంపై మండల స్థాయి అధికారులు దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ కోరారు. శనివారం వేపాడలో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా జగనన్నఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంపై అధికారులతో చర్చించారు.కార్యక్రమంలో ఈవోపీర్డీ ఉమ పాల్గొన్నారు. అలాగే పాటూరు గ్రామ సచివాలయపరిధిలో ప్రభుత్వం మంజూరుచేసిన ఇళ్లను లబ్ధిదారులు ఈనెల 31లోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మండల ఆదేశించారు.పాటూరు సచివాలయ పరిదిలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు వైవీని కలవనున్న రఘురాజు వర్గం

శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని ఆదివారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో పాటు ఆయన వర్గం నాయకులు, కార్యకర్తలు కలవనున్నారు. ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిక్కెట్ కేటాయించవద్దని కోరేందుకు కలుస్తున్నట్లు సమాచారం. విశాఖలో వైవీ సుబ్బారెడ్డిను కలిసేందుకు ప్రతి మండలం నుంచి వెళ్తున్నట్లు రఘురాజు వర్గానికి చెందిన ఓ ముఖ్యనేత తెలిపారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

బొబ్బిలి: మండలంలోని అలజంగిలో శనివారం సమరసతా ఫౌండేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో శ్రీరాముని అక్షింతలు, అయోధ్యలో ఏర్పాటు చేసిన భవ్య దేవాలయం ఫోటోలు, కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దూపం వాసు, రాంబార్కి జగదీశ్, బడి త్రినాథ్, నడుపూరు వెంకటేశ్, మెరుపుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● వేపాడ: వల్లంపూడి,వేపాడల్లో శనివారం అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను వేపాడ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్థులకు పంపిణీ చేసినట్లు జడ్పీటీసి సభ్యుడు శానాపతి అప్పలనాయుడు తెలిపారు. వేపాడ, వల్లంపూడి గ్రామాలకు చెందిన గుమ్మిడి నరసింహమూర్తి, వల్లంపూడి ఉపసర్పంచ్ రుద్ర వెంకటరావు ఆధ్వర్యంలో వేపాడ మహిళా భజన బృందం సభ్యులు హరినామ సంకీర్తనలతో పంపిణీ చేసినట్లు చెప్పారు.

ఆకట్టుకున్న రంగవల్లులు

ఆనందంగా ఉంది



ఏటా 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ ఏడాది నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించడం సంతోషంగా ఉంది. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఇటువంటి పోటీలను నిర్వహిస్తూ మన సంప్రదాయాలను కాపాడడం హర్షణీయం.

- వి.అరుణకుమారి, పార్వతీపురం, ప్రథమ విజేత

ముందే సంక్రాంతి వచ్చింది



'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొనడంతో ముందే సంక్రాంతి సందడి మొదలైనట్లుగా ఉంది. నాకు ద్వితీయ బహుమతి రావడం సంతోషంగా ఉంది.

- కె.పవిత్ర, ద్వితీయ విజేత, పార్వతీపురం

పట్టణానికే గర్వకారణం



'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఏటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ.. కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నారు. నాకు ఈ ముగ్గుల పోటీల్లో తృతీయ బహుమతి రావడం ఎంతో ఆనందంగా ఉంది. పార్వతీపురంలో ఇటువంటి పోటీలు నిర్వహించడం పట్టణానికే గర్వకారణం.

-వి.శ్రీలత, తృతీయ విజేత, పార్వతీపురం



లోగోల ముగ్గులు వేస్తున్న దృశ్యం

పార్వతీపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం రంగవల్లులతో కళకళలాడింది. సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి.



విద్యార్థినుల సందడి

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన" సహకారంతో పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం ముత్యాలముగ్గు పోటీలు నిర్వహించారు. పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మహిళలు తరలివచ్చి విభిన్న ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా స్పాన్సర్లు, విజేతల అభిప్రాయాలు వారి మాటల్లోనే...



ముగ్గులు వేస్తున్న మహిళలు

హర్షణీయం..



'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఆధ్వర్యంలో పార్వతీపురంలో ముత్యాల ముగ్గుల పోటీ నిర్వహించడం జిల్లాకే గర్వకారణం. ఈ పోటీలకు పెద్దఎత్తున విద్యార్థినులు, మహిళలు పాల్గొనడం ఆనందంగా ఉంది. కనుమరుగవుతున్న సంప్రదాయలను కాపాడుతూ.. విద్యార్థినులు, మహిళల్లో సృజనాత్మకత వెలికితీస్తూ ఇటువంటి పోటీలు నిర్వహించడం హర్షణీయం. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఏ కార్యక్రమం నిర్వహించినా అద్భుతమే.

- యిండుపూరు గోపాలరావు, శ్రీ వెంకటేశ్వర జ్యూయల్ ప్యాలెస్ యజమాని, పార్వతీపురం



ముత్యాల ముగ్గుల పోటీల నిర్వహణలో ఆంధ్రజ్యోతి స్టాఫర్ డీఎస్ఆర్ పట్నాయక్, ఆంధ్రజ్యోతి రిపోర్టర్లు ఎస్.గౌరీశంకర్, గుంట్రెడ్డి పోలినాయుడు, కోట శివ, బరాటం చంద్రమౌళి, రాఘవేంద్రరావు, ఏబీఎన్ రిపోర్టర్ ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.రామారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. ఏపీఎన్జీవో సంఘం నాయకులు జీవీఆర్ఎస్ కిషోర్ ముగ్గుల పోటీలను పరిశీలించారు. స్థానిక సీఐ కృష్ణారావు, ఎస్ఐలు, మహిళా కానిస్టేబుళ్లు ముగ్గుల పోటీలను తిలకించారు.

తోటపల్లి దేవస్థానం అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న ఈవో సూర్యనారాయణ

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామ స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. శనివారం దేవస్థానం ప్రాంగణంలో ధర్మకర్తల మండలి సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఆలయానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో భక్తులకు ఉపయోగపడేలా నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు. రెండు ఆలయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు సీహెచ్ఎఫ్ నిధుల కోసం ప్రతిపాదనలు చేస్తున్నామని తెలియజేశారు. అలాగే వార్షిక కల్యాణోత్సవం నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో చైర్మన్ ఎం.సత్యనారాయణ, సభ్యులు గౌరీశంకరరావు, జి.సింహాచలంనాయుడు, కె.సాగర్, అభివృద్ధి కమిటీ ప్రతినిధి డాక్టర్ డి.పారినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిమ జాతి గిరిజనులకు పక్కా ఇళ్లు

గుమ్మలక్ష్మీపురం: ఐటీడీఏ పరిధిలోని ఆదిమ జాతి గిరిజన తెగ పీవీటీజీ గిరిజనులకు పీఎం జన్మన్ పథకం కింద పక్కా ఇళ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. సవర, గదబ తెగకు చెందిన గిరిజనుల కోసం ఈ నిర్మాణాలను చేపట్టనున్నారు. ఒక్కొక్క ఇంటికి రూ.2.50లక్షల చొప్పున నిధులు కేటాయిస్తున్నారు. సచివాలయాల ద్వారా పీవీటీజీ లబ్ధిదారుల పేర్లు నమోదు చేసుకోవడానికి ఐటీడీఏ చర్యలు తీసుకుంటోంది. ఇళ్లు లేని సవర, గదబ తెగలకు చెందిన గిరిజనులు తమ పేర్లను గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని పీవో సూచించారు. పూర్తి స్థాయి ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కాంతిలాల్ దండే నుంచి అన్ని ఐటీడీఏలకు ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే ఈ పథకం అమలుకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనరేట్ నుంచి జాయింట్ డైరెక్టర్ క్యాడర్ అధికారులను వివిధ ఐటీడీఏలకు కేటాయించి.. పర్యవేక్షణ బాధ్యతను అప్పగించారు.

నిబంధనల మేరకు..



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: ఆర్థికంగా వెనుకబడిన గిరిజనులకు కేంద్ర ప్రభుత్వ నిబంధనలతో పథకాలు మంజూరవుతాయని మండల గృహ నిర్మాణశాఖ జేఈ వంగపండు అఖిల్ తెలిపారు. శనివారం రాయిందొరవలస గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఆర్థిక స్థితిగతులను పరిశీలించి, తగు చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలతో చెక్‌పోస్టులు



ఎల్విన్‌పేటలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు

గుమ్మలక్ష్మీపురం: కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ముఖ్యమైన రహదారులపై పోలీస్ శాఖ చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా ఎల్విన్‌పేట కూడలిలో పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. దీని వద్ద 24 గంటలూ పోలీసుల గస్తీ ఉంటుంది. ఒడిశా, తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఈ చెక్‌పోస్టు కొనసాగించనున్నట్టు ఎల్విన్‌పేట ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు



డ్రైన్ పనులను పరిశీలిస్తున్న జేఈ గౌరీశంకరరావు

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో ప్రభుత్వ నిబంధనల మేరకు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశామని మండల పంచాయతీరాజ్ ఇన్‌చార్జి జేఈ పి.గౌరీశంకరరావు తెలిపారు. శనివారం పెద్దూరు గ్రామంలో నిర్వహిస్తున్న సీసీ డ్రైన్స్ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రధానంగా సీసీ రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉపాధిలో సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణ పనులు వేగవంతానికి చర్యలు చేపడుతున్నామన్నారు. పంచాయతీల్లో నిర్వహించే పనుల్లో నాణ్యత లోపాలు ఉన్నట్లయితే చెల్లింపుల్లో కోత విధిస్తామని చెప్పారు. ఈ పరిశీలనలో ఉప సర్పంచ్ తెర్లి యల్లంనాయుడు, సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం



దేవనాపురంలో రైతులతో మాట్లాడుతున్న దేవుళ్లు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ యూనివర్సిటీ చైర్మన్ పి.దేవుళ్లు స్పష్టం చేశారు. శనివారం దేవనాపురం ఆర్బీకేలో రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే లాభదాయక పంటలను వివరించారు. ఏ గ్రేడ్ ఏటీఎం, గుల్లిరాగి వంటి రకాల పంటల సాగుపై గిరిజన రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఎస్ఎఫ్ఏ వై.మునలయ్య, డివిజన్ మాస్టర్ ట్రైనర్ బాలు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

గరుగుబిల్లి: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ఉండేలా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు ఆదేశాల మేరకు శనివారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఉల్లిభద్రలో సచివాలయ కార్యదర్శి కోటేశ్వరరావు పర్యవేక్షణలో రక్షిత తాగునీటి పథకంలో క్లోరినేషన్ చేశారు.

10న బొబ్బిలికి చంద్రబాబు రాక

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 10న బొబ్బిలి వస్తున్నట్టు పార్వతీపురం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర చెప్పారు. శనివారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రా.. కదలిరా కార్యక్రమంలో భాగంగా 2.40లక్షల మందితో బొబ్బిలిలో మహాసభ జరుగుతుందని తెలిపారు. పార్వతీపురం నియోజకవర్గం నుంచి 30 వేల మంది హాజరవుతారని చెప్పారు. బొబ్బిలిలో నిర్వహించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. నర్సీపట్నం టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు విజయ్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి దుర్మార్గ పాలన వల్ల రాష్ట్రం ఎంతో వెనక్కి వెళ్లిపోయిందన్నారు. చోడవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాతయ్యబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమన్నారు. ఈ సమావేశంలో పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకులు గోవిందరాజులు, బలిజిపేట నియోజకవర్గ అధ్యక్షుడు బుడితి శ్రీరాములు, నాయకులు మల్ల సురేంద్ర, గొట్టాపు వెంకటనాయుడు, పెంకి వేణుగోపాలనాయుడు, గుంప స్వామి, బోను దేవీ చంద్రమౌళి, పి.సత్యనారాయణ, బడే గౌరునాయుడు, టి.వెంకటరమణ, కె.తిరుపతిరావు, సింహాలు, గొరగాన చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయచంద్ర, తదితరులు

సికిల్‌సెల్ టెస్టులు చేయండి

● ఐటీడీఏ పీవో కల్పనాకుమారి



మాట్లాడుతున్న పీవో

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని అన్ని గిరిజన గ్రామాల్లో సికిల్‌సెల్ ఎనిమియా టెస్టులు చేయాలని పీవో కల్పనాకుమారి ఆదేశించారు. శనివారం ఐటీడీఏ ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలకు అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిపై పూర్తిస్థాయిలో గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సిబ్బంది నిత్యం క్షేత్ర స్థాయిలో ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీటీసీవో అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతలు



సాలూరు రూరల్: మామిడిపల్లిలో అక్షింతల పంపిణీ



భామిని: కోలాటం ఆడుతున్న మహిళలు

సాలూరు రూరల్: అయోధ్య నుంచి వచ్చిన బాల రాముడి అక్షింతలను మామిడిపల్లిలో ఇంటింటికీ పంపిణీ చేశారు. తొలుత అక్షింతలకు గుడిలో పూజలు చేశారు. ఈసందర్భంగా చిన్నారుల శ్రీరాముడు, సీత వేషధారణ ఆకట్టుకుంది. సాలూరు పట్టణంలోని వేంకటేశ్వర కాలనీలో అక్షింతలను శ్రీరామ ఆలయ నిర్వహణ కమిటీ ఇంటింటికీ పంపిణీ చేసింది. ● భామిని: రామ జన్మభూమిలో నూతన మందిరం ప్రతిష్ఠ సందర్భంగా శనివారం మేళ, తాళాలు, ఆటపాటలతో గ్రామంలో అక్షింతలు, ఆహ్వాన పత్రాలను ఇంటింటికి మహిళలు పంపిణీ చేశారు. మహిళలు కోలాటాలు, నృత్యాలతో ఆనందంగా పాల్గొన్నారు.

వైభవంగా లలిత బాలాత్రిపుర సుందరికి పూజలు



పూజలు చేస్తున్న దృశ్యం

సాలూరు రూరల్: స్థానిక పంచముఖేశ్వర స్వామి ఆలయంలో లలితా బాలా త్రిపుర సుందరి పూజలు శనివారం ప్రారంభించారు. అమ్మవారికి 108 రకాల నైవేద్యాలతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. సనాతన ధర్మపరిషత్ సారథి సుబ్బ గురువు, వినయ శర్మ తదితరులు పాల్గొన్నారు. లక్కీ డ్రాలో గెలుపొందిన భక్తులకు అమ్మవారి చీరలు బహూకరించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు.

'యువత ఆగ్రహానికి జగన్ గురి కాకతప్పదు'

గజపతినగరం: జగన్ నిరుద్యోగ యువత ఆగ్రహానికి గురికాక తప్పదని తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు వేమలి చైతన్యబాబు అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జాబు హామీలు ఎప్పుడు జగన్ అంటూ ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో వచ్చిన పరిశ్రమల ను తరిమేయడం, ఉన్న ఉద్యోగాలు పోవడంతో యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పెదిరెడ్ల సత్యనారాయణ, గణేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

'ఎస్మా సబబు కాదు'



సీతంపేట: నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

గుమ్మలక్ష్మీపురం: తమ హక్కుల కోసం పోరాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించడం ప్రభుత్వం నిరంకుశ చర్యకు నిదర్శనమని టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వరి అన్నారు. ఈ చర్యను ప్రజా సంఘాలు, వివిధ పార్టీలు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో తమ హక్కుల కోసం ఉద్యోగులు, కార్మికులు నిరసన చేయడం సహజమన్నారు. వీరిపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దురదృష్టకర చర్యగా ఆమె అభివర్ణించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జీవో కాపీలు దహనం

సీతంపేట: తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారంతో 26వ రోజుకు చేరుకుంది. ఈక్రమంలో ప్రభుత్వం.. అంగన్‌వాడీలు సమ్మెను చేపట్టడం విరుద్ధమంటూ ఎస్మా జీవోను విడుదల చేసింది. దీంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె శిబిరాల వద్ద ఎస్మా జీవో కాపీలను దహనం చేశారు.

మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రీబాయి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయినిలు

సాలూరు రూరల్: స్వతంత్ర భారతావనిలో మహిళా విద్యకు ఆద్యురాలు, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అనకాపల్లి గణేష్ అన్నారు. ఆమె జయంత్యుత్సవాల సందర్భంగా శనివారం గదబ కరకవలస పాఠశాలలో నివాళులర్పించారు. గేదెల సరస్వతి, ఆర్.రజని, అన్సారి బేగంలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఐ.రాజమణి, జిల్లా కార్యదర్శి జానకిరావు, మండల గౌరవ అధ్యక్షుడు సింగరాపు సింహాచలం, ఈదిబిల్లి సుశీల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆట స్థలం కబ్జాకు ప్రయత్నం

పాలకొండ: డివిజన్ కేంద్రంలోని గారమ్మ కాలనీలో ఆట స్థలం కోసం విడిచిపెట్టిన స్థలాన్ని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసేందుకు శనివారం భూమి పూజ చేశారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సమస్య తెలుసుకున్న కలెక్టర్.. సోమవారం కలెక్టరేట్‌కు రావాలన్నారు. సోమవారం కాలనీవాసులంతా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కాలనీవాసులంతా ఏకమై మైదానం కోసం విడిచిపెట్టిన స్థలాన్ని వదిలిపెట్టేది లేదన్నారు. ఐక్యంగా పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన, టీడీపీ నాయకులు సైతం ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమైతే సహించేది లేదని, కాలనీవాసుల తరఫున పోరాటానికి ముందుంటామని తెలిపారు.

క్లుప్తంగా..

స్వల్పకాలిక శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: ప్రభుత్వ ఐటీఐలో స్వల్పకాలిక ఉచిత శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఏసీ మెకానిక్గా, కుట్టు మిషన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆటో మోటార్ సర్వీస్, టెక్నీషియన్ కోర్సులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 12వ తేదీలోగా ఐటీఐలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7993795796 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

సీతానగరం: సీతానగరం మండలం బూర్జ గ్రామ శివారులో 100 మద్యం సీసాలతో ఓ వ్యక్తి పోలీసులకు చిక్కాడు. బలిజిపేట మండలం మురగడం గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంలో మద్యం సీసాలు తరలిస్తుండగా... అదుపులోకి తీసుకుని వాటిని స్వాధీనం చేసుకున్నామని.. కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయరూ..



సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పాలకొండ: నగరంలోని 12వ వార్డు కోమటిపేటలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, రామ కళామందిర్ సచివాలయం అడ్మిన్‌లను స్థానికులు కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. కోమటిపేటలో మూడు వీధి లైట్లు వెలగడం లేదన్నారు. కోమటిపేట చివరిలో ఉన్న లైటు, కళింగ కోమటి కల్యాణ మండపం దగ్గర ఉన్న లైటు, కోమటిపేట వీధి మొదట్లో ఉన్న పెద్ద వీధిలైటు వెలగడం లేదని వివరించారు. మరోవైపు కాలువలు పూడికతో నిండిపోయాయని, వాటిని తొలగించాలని కోరారు.

సాలూరు డిగ్రీ కళాశాలలో నాక్ బృందం

సాలూరు రూరల్: సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కమిటీ (నాక్) బృందం శనివారం పరిశీలించింది. నాక్‌కు బృంద సభ్యులు శిరసాని సత్యనారాయణ, ముస్తాక్ అహ్మద్, దర్శి దిలీప్ దొండ్లలు పరిశీలించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి కళాశాల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ విభాగాలను వారు పరిశీలించారు. తల్లిదండ్రులు, పూర్వ ప్రస్తుత విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీఈ ప్రతినిధి ఐ.విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రేఖా.నెం.810/2017/ఎ1. పురపాలక సంఘ కార్యాలయం,
తే. 06.01.2024దీ. పార్వతీపురం.

బహిరంగ వేలం ప్రకటన

పార్వతీపురం పురపాలక సంఘమునకు సంబంధించి 2024-2025 ఆర్థిక సంవత్సరమునకు గాను అనగా తే.01.04.2024దీ నుండి 31.03.2025దీ వరకు రోజువారీ మార్కెట్ మరియు పురపాలక సంఘ పరిధిలో గల వివిధ ఏరియాలు నందు మరియు రోడ్డుమార్జిన్ ఆశీలు వసూలు చేసుకునే హక్కు పొందుటకు గానూ తే.12.01.2024దీ శుక్రవారం ఉదయం గం.11.00లకు కమీషనరు వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని పురపాలక సంఘ కార్యాలయపు ఆవరణలో బహిరంగవేలం నిర్వహించబడును. సదరు వేలంపాటలో పాల్గొనువారు ఈ దిగువనుదహరించిన ధరావత్తు మొత్తము మరియు సాల్వెన్సీ ధృవీకరణ పత్రముతో వేలంపాటలో పాల్గొనవచ్చునని తెలియజేయడమైనది. ఇంకను అదనపు సమాచారం కొరకు పురపాలక సంఘ కార్యాలయం పనిచేయు వేళలయందు రెవెన్యూ విభాగములో తెలుసుకొనవచ్చును.

	వివరాలు	ధరావత్తు	సాల్వెన్సీ
1.	రోజువారి మార్కెట్‌యందు మరియు పురపాలక సంఘ పరిధిలో గల వివిధ ఏరియాలలో మరియు రోడ్డు మార్జిన్ ఆశీలు వసూలు చేసుకునే హక్కు పొందు నిమిత్తం.	రూ.4,00,000/-లు	రూ.5,00,000/-లు
2.	కబేళాల యందు ఆశీలు వసూలు చేసుకునే హక్కు పొందు నిమిత్తం	రూ. 25,000/-లు	రూ.1,00,000/-లు

సం/-కమీషనరు,
పార్వతీపురం పురపాలక సంఘం

జాగ్రత్తగా నడిపితే ప్రమాదాలకు దూరం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాయగడ: వాహన చోదకులు అన్ని జాగ్రత్తలు తీసుకుని సురక్షితం గా వాహనాలు నడిపితే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అదనపు కలెక్టర్ భాస్కర రౌయితో అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వివిధ విద్యాసంస్థల విద్యార్థులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక సర్క్యూట్ హౌస్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. వాహన చోదకులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రవాణా శాఖాధికారులు పాల్గొన్నారు.

ఒడిశా

'హిట్ అండ్ రన్'కు వ్యతిరేకంగా డ్రైవర్ల నిరసన



నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

రాయగడ: కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్‌కు రూపొందించిన చట్టం డ్రైవర్ల పాలిట పెనుశాపంగా మారనుందని ఒడిశా డ్రైవర్ల మహాసంఘ సభ్యులు స్థానిక సాయి ఇంటర్నేషనల్ మార్గంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘ అధ్యక్షుడు జితేంద్ర నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టం ప్రకారం ప్రమాదం జరిగిన వెంటనే వాహన చోదకులు అక్కడి నుంచి పారిపోతే రూ.10 లక్షల జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. ఇది ఎంత మాత్రం సమ్మతం కాదన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

నెల్లిమర్ల: అరుణాచలప్రదేశ్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో విజయనగరంలోని అయ్యన్నపేటకు చెందిన వై.చైతన్యకుమారి ప్రతిభ కనబరిచింది. ఈమె 81 కిలోల కేటగిరిలో పాల్గొని యూత్, జూనియర్ విభాగాల్లో కాంస్య పతకం సాధించినట్లు కోచ్, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి చల్లా రాము తెలిపారు. ● కర్నూలు జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో 40 కిలోల కేటగిరీలో కొండవెలగాడ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వల్లూరి రమాదేవి విజేతగా నిలిచి బంగారు పతకం సాధించిందని పీడీ పతివాడ శ్రీనివాసరావు చెప్పారు. అలాగే మరో విద్యార్థిని జీనపాటి దేవిశ్రీ జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించిందని చెప్పారు.